# ఫేవరెట్

## దిలావర్

రోజూ సాయంత్రం బోర్డర్స్‌కు వెళ్ళడం అలవాటు చేసుకున్నాను. 'బోర్డర్స్', 'బ్యారెన్స్ అండ్ నోబుల్స్' దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పుస్తకాల షాపులు, ఇవి మన ఇండియాలో పుస్తకాలమ్మే షాపుల్లా వుండవు. ఒక్కొక్క షాపూ మన సెంట్రల్ లైబ్రరీ అంత పెద్దగా వుంటుంది. మధ్య మధ్య, కస్టమర్స్ కూచొని చదువుకోవడానికి సోఫాలుంటాయి. ఇష్టమైతే కొనుక్కోవచ్చు లేకుంటే లేదు. వీటిలోనే మ్యూజిక్ కేఫ్‌లు, కాఫీ కేఫ్‌లు కూడా వుంటాయి.

బోర్డర్స్ ముందు విశాలమైన ఆవరణ వుంది. ఆవరణలో అక్కడక్కడా పెద్దపెద్ద గొడుగులు అమర్చి వున్నాయి. ప్రతి గొడుగు కిందా ఒక్కొక్క రౌండు టేబులూ వాటి చుట్టూ కుర్చీలూ వేసి వున్నాయి. కాఫీ కేఫ్‌లోంచి కాఫీలు తెచ్చుకొని సిప్ చేస్తూ రిలాక్స్‌డ్‌గా ఇక్కడ కూచొని చదువుకుంటారు.

లోపల్నుంచి ఓ పుస్తకం తీసుకొచ్చి చదవడంలో నిమగ్నమయ్యాను.

''ఎక్స్క్యూజ్‌మి. లైటర్ వుందా'' అన్న ఇంగ్లీషు మాటలు విని పుస్తకంలోంచి తల తీసి పక్కకు చూశాను.

ఇరవై - ఇరవై ఐదు ఏండ్లు వుండొచ్చు. జీన్స్ పాంటు మీద గులాబి స్కర్టు వేసుకుంది. తెల్లని పాల మీగడ లాంటి శరీర ఛాయ. నీలి కళ్ళు. వంపు తిరిగిన, దట్టమైన కనుబొమలు. కొనదేలి కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న ముక్కు. పలచగా వున్న పెదవులు. నిర్లక్ష్యంగా ముందుకు తోసుకొచ్చిన వెంట్రుకలు. కొంచెం రఫ్‌గా అనిపిస్తున్నా అందగత్తే మొత్తంమీద. నోట్లో స్టైల్‌గా సిగరెట్టు పెట్టుకొని, పక్క టేబుల్ దగ్గర కూచొని నావైపే చూస్తున్నది ఒక అమ్మాయి.

''నో. సారీ!'' అన్నాను ఆ అమ్మాయివైపే చూస్తూ.

''వీళ్ళు... మగాళ్ళు కూడా పొగ తాగరు'' తనలో తాను గొణుక్కుంటున్నట్టు అన్నది ఆ అమ్మాయి.

''ఏం... మీరు ఆడవాళ్ళు కూడా తాగుతారా?'' సూటిగా ఆ అమ్మాయి కళ్ళలోకి చూస్తూ అన్నాను.

''ఏంటి?'' అన్నది ఆ అమ్మాయి.

''పొగ'' అన్నాను.


నా మాట విని పకపకా నవ్వింది. అంత హాస్యం పుట్టిపడే మాటలేమన్నానని? నాకు చిర్రెత్తుకొస్తున్నది.

''ఇంకా... డ్రింకేమోననుకున్నాను'' నవ్వాపుకుంటూ అన్నది.

''అంటే డ్రింక్ కూడా చేస్తారా?'' విస్తుపోతూ అడిగాను.

''అసలు ఎవరైనా ఎందుకు తాగుతారు?'' ఎదురు ప్రశ్న వేసింది.

''ఏమో. నాకు తెలీదు'' అన్నాను ముక్తసరిగా. ఇంతటితో సంభాషణ ఆపాలని అనుకున్నాను. ఆ అమ్మాయి సాగని



వ్వటం లేదు.

"నా మటుకు నేను యింటి పరిస్థితులు బాగో లేక తాగుతున్నాను..." అన్నది నన్ను సంభాషణ లోకి లాగుతూ.

"పరిస్థితులు బాగులేకపోతే తాగుడొక్కటే పరిష్కారమా?" అన్నాను.

"అవన్నీ నాకు తెలియదు. మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నందుకు క్షమించండి... మా అమ్మ, డాడీకి డైవోర్సు యిచ్చి ఇంకో పెళ్ళి చేసుకుంది. డాడీ కూడా మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. మా అమ్మ రెండో భర్త నన్ను కూతురులా చూడడు. మా నాన్న రెండో భార్యా నన్ను తన బిడ్డలా చూసుకోదు.. నా పరిస్థితి ఎలా వుంటుందో ఆలోచించండి..." నానుండి ఎలాంటి సానుభూతీ ఆశించకుండా చాలా మామూలుగా చెప్పింది.

"ఇట్స్ ఓ.కె." అని పుస్తకంలో తలదూర్చాను.

"ఎక్స్క్యూజ్‌మి" అంది ఆ అమ్మాయి మళ్ళీ.

ఓరినాయనో... ఇదెవతో నన్ను వదిలిపెట్టేట్టు లేదు బాబోయ్ అనుకున్నాను మనసులో.

"ఏం పుస్తకం చదువుతున్నారు?" అని అడిగింది.

అట్టమీద ఓసారి చూసి "పోయెమ్స్ ఎగైనెస్ట్ ది వార్" అన్నాను అయిష్టంగానే.

"నేనూ చదివాను. యుద్ధానికి వ్యతిరేకంగా వైట్‌హౌస్‌లో సింపోజియం ఏర్పాటు చేస్తే రెండు వందలమంది కవులు పాల్గొన్నారట. ఈ పుస్తకం సంపాదకుడు శామ్ హామిల్ ఆహ్వానం అందగానే పదకొండు వేలమంది కవులు తమ కవితల్ని పంపారట. మా వాళ్ళలో ఎంత యుద్ధ వ్యతిరేకత వున్నదో గమనించారా?" అన్నది మెరిసే కళ్ళను విశాలం చేస్తూ.

యుద్ధ వ్యతిరేకత గురించి ఆ అమ్మాయి మాట్లాడిన తీరుకు, నాలో ఆ అమ్మాయి ఎడల కలిగిన విముఖత కొంత సడలింది. మెచ్చుకోలుగా ఆ అమ్మాయి వైపు చూశాను.

"ఓ.కె. సీయూ" అని హైహీల్స్ టకటకలాడించుకుంటూ వెళ్ళిపోయింది ఆ అమ్మాయి.

* * *

బోర్డర్స్ ఆరుబయట కూచోడమంటే నాకు చాలా యిష్టం. ఎడమవైపు విశాలమైన టార్గెట్. కుడివేపు దాన్ని మించిన లాంగ్స్ డ్రగ్స్. ఎదురుగా కొంచెం దూరంలో సేఫ్ వే. దాని పక్కనే ఉద్యానవనాన్ని తలపించే, రకరకాల రంగుల పూలతో గుబాళించే మైకేల్. మధ్యలో అన్నివైపులా పార్క్ చేసి వున్న కార్ల సముద్రం. 'హబ్' అంతా సందడి సందడిగా వున్నా ప్రశాంతతకు ఏమాత్రం భంగం కలగదు.

"ఎక్స్క్యూజ్‌మి"

తల తిప్పి చూశాను.

ఓ మధ్య వయస్కురాలు. మిడ్డీ మీద స్లీవ్‌లెస్ స్కర్టు వేసుకుంది. తెల్లగా బొద్దుగా వుంది. బతికి చెడ్డదానిలా కనిపిస్తున్నది.

"గుడీవినింగ్. నా భర్త పెరాల్సిస్‌తో లేవలేని స్థితిలో వున్నాడు. కొడుకులూ, కూతుళ్ళూ వేరే కాపురముంటున్నారు. ప్లీజ్ హెల్ప్. ఏమైనా చేంజ్ వుంటే..." చేతులు నలుపుకుంటూ, దయనీయంగా నావైపు చూస్తూ అడిగింది.

మొదట నాకాశ్చర్యం వేసింది. అమెరికాలో కూడా అడుక్కునేవాళ్ళుంటారా అనుకున్నాను. జేబులోంచి ఒక డాలర్ తీసి యిచ్చాను.

"థాంక్యూ వెరీమచ్" అనుకుంటూ వెళ్ళిపోయిందావిడ.

నేను పూర్తిగా ఆ సంఘటన నుంచి తేరుకోక ముందే "హాయ్ అంకుల్" అనుకుంటూ వచ్చింది నిన్నటి అమ్మాయి.

"హాయ్" అన్నాను బదులుగా.

"ఎంతిచ్చారేమిటి?" వెళ్ళిపోతున్నావిడను చూస్తూ అడిగింది.

"ఎంతిస్తే ఏంటిలెండి" అంటూ నా జవాబు ఆశించకుండా తనే మాట్లాడ్డం మొదలెట్టింది. "ఈమేకాదు అంకుల్. ఇలాంటి వాళ్ళు అమెరికాలో చాలామంది వున్నారు. కాళ్ళు చేతులు విరిగిన వాళ్ళు. పనీపాటా లేనివాళ్ళు. ఏ ఆధారం లేని వాళ్ళు. వీళ్ళంతా మా దేశంలో అనధికార బిచ్చగాళ్ళు. అధికారికంగా బిచ్చగాళ్ళు లేని దేశంకిందే లెఖ్ఖ..." గలగలా మాట్లాడుతూనే వుంది.

"అవునూ... నిన్న నా పేరడగలేదేంటి?" అంది మళ్ళీ తనే.

"అన్నీ నేనడిగితేనే చెబుతున్నావా?" ముఖం ముటముటలాడించుకుంటూ అన్నాను.

"ఓ.కె. నా పేరు లిజీ... లిజీ మగ్వాయర్.. అదేంటో.. అందరితోనూ యిలాగే లొడలొడ వాగేస్తుంటాను అంకుల్. నేను చెప్పేది వాళ్ళు వింటున్నారా లేదా అని కూడా పట్టించుకోను..." ఆపకుండా మాట్లాడుతూనే వుంది ఆ అమ్మాయి.

నేను నిజంగానే ఆమె మాటలు పట్టించుకోకుండా ఆకాశం వైపు చూపులు నిలిపాను.

ఆకాశంలో ఒక విమానం చక్కర్లు కొడుతున్నది. విమానం తోకకు నైలాన్ దారాలతో కట్టిన, రంగురంగుల అక్షరాల పెద్ద బ్యానర్ గాలిలో తేలిపోతూ విమానాన్ని అనుసరిస్తున్నది. కొంచెం థ్రిల్లింగ్‌గా అనిపించి అటే చూస్తున్నాను.

నేనటు చూడటం పసిగట్టినట్టుంది. "ఓ... అదా అంకుల్. న్యూ షాప్ ఓపెన్ చేస్తున్నారన్న మాట. అంతా డాబుసరి ప్రచారం..." అంది లిజీ.

"ఎందుకలా అంటున్నావు?" అడగకుండా వుండలేకపోయాను.

"హమ్మయ్య. ఇప్పటికి నా లోకంలోకొచ్చారన్నమాట" లిజీ ముఖం సంతోషంతో వెలిగిపోయింది. "చూడండి అంకుల్. ఇవాళ చైనావారి ప్రాడక్ట్సు లేకుంటే పూటగడవని స్థితికి చేరుకున్నాం మేము... మీకో విషయం తెలుసా? ఈ సిలికాన్ వ్యాలీ అంటే విదేశాల్లో ఎంత క్రేజ్ వుంది? కానీ యిక్కడి పరిస్థితి వేరు. ఐదారుగురు కలిసి ఓ కంపెనీ పెడతారు. పెట్టినన్నాళ్ళు పట్టదు మూతపడటానికి. ఒక్క బే ఏరియాలోనే పదహారొందల స్టార్ట్ అప్ కంపెనీలు మూతపడ్డాయి. మాయదారి ఏజెన్సీలకు వేలకు వేలు గుమ్మరించి తీరా యిక్కడికొచ్చాక ఉద్యోగాలు దొరక్క, నోట మాటరాక గిలగిల తన్నుకుంటారు. ఎంతమంది జీవితాలు ఇలా ఆరిపోయాయో లెక్కేలేదు" నిట్టూర్చింది లిజీ.

ఏమో అనుకున్నాను కానీ అమ్మాయికి లోకజ్ఞానం బాగానే వుంది అనుకున్నాను.

"అన్నట్టు మీ పేరడగలేదు కదూ? అడగను కూడా. అంకుల్ అని పిలిస్తేనే బాగుంటుంది. బైదిబై... నేను ఆ కనిపిస్తున్న టార్గెట్‌లో సేల్స్ గర్ల్‌గా పనిచేస్తున్నాను. ఓ.. సీయూ..." అంటూ హడావిడిగా వెళ్ళిపోయింది.

* * *

రోజూ సాయంత్రం లిజీతో మాట్లాడ్డం అలవాటైపోయింది. ఏ కారణంచేతనైనా – ఎన్నడైనా లిజీ కనబడకపోతే ఆ రోజంతా ఏదో వెలితిగా – దిగులుగా వుంటుంది. కొందరితో ఎంతోకాలం పరిచయమున్నా అంత ఇంటిమసీ ఏర్పడదు. కొందరు కొన్ని గంటల్లోనే యుగాల స్నేహం అందించగలరు.

మీకో విషయం తెలుసా? ఈ సిలికాన్ వ్యాలీ అంటే విదేశాల్లో ఎంత క్రేజ్ వుంది? కానీ యిక్కడి పరిస్థితి వేరు. ఐదారుగురు కలిసి ఓ కంపెనీ పెడతారు. పెట్టినన్నాళ్ళు పట్టదు మూతపడటానికి. ఒక్క బే ఏరియాలోనే పదహారొందల స్టార్ట్ అప్ కంపెనీలు మూతపడ్డాయి. మాయదారి ఏజెన్సీలకు వేలకు వేలు గుమ్మరించి తీరా యిక్కడికొచ్చాక ఉద్యోగాలు దొరక్క, నోట మాటరాక గిలగిల తన్నుకుంటారు. ఎంతమంది జీవితాలు ఇలా ఆరిపోయాయో లెక్కేలేదు

నా ఆలోచనలకు బ్రేక్ వేస్తూ "హాయ్ అంకుల్" అనుకుంటూ వచ్చింది లిజీ. నోట్లో సిగరెట్ వెలుగుతున్నది. గుప్‌గుప్ మంటూ రైలింజనులా పొగ వదులుతున్నది.

"ఇవాళ కొంచెం లేటయింది. అట్నుంచటే వెళ్ళిపోదామనుకున్నా. మీరు గుర్తొచ్చారు. ఏంటో... మిమ్మల్ని చూడని రోజు మనసేం బాగోదు. కొంపదీసి మిమ్మల్ని లవ్ చేస్తున్నానేమో అంకుల్..." ఒక కన్ను మూసి, వేరొక కన్ను పెద్దగా చేసి నావైపు ఓరగా చూస్తూ పకపకా నవ్వింది లిజీ.

"ఏయ్ నాటీగళ్! నా వయసెంతనుకుంటున్నావ్?" అన్నాను చెయ్యి పైకెత్తి కొట్టబోయినట్టు నటిస్తూ.

"ఎంతేమిటి?" అన్నది.

"ఫిఫ్టీ" అన్నాను.

"మీరలా కనబడరు అంకుల్. అయినా ఫిఫ్టీ యీజ్ నాట్ ఓల్డ్ యూ నో" అన్నది లిజీ పెద్ద ఆరిందలా.

"మా దగ్గరైతే... నలభై ఏళ్ళ వృద్ధుడు... అని మొదలెడతారు మా రచయితలు..." అంటూ ఎప్పట్నుంటో రచయితల మీదున్న కినుకను వెళ్ళగక్కాను.

''రచయితలు కదా! సర్వస్వతంత్రులు. వాళ్ళెలాగైనా రాస్తారు. మా హాలీవుడ్ సినిమాలు చూశారా? అంతా ముదురు సరుకే. ఇటీవల ఓ ముసలి జేమ్స్‌బాండ్‌కు వేలాదిమంది అమ్మాయిలు ప్రేమలేఖలు రాశారట. ఇప్పుడిప్పుడే కొత్త నీళ్ళు కూడా వస్తున్నాయనుకోండి. అంతెందుకు? మా నాన్నను పెళ్ళి చేసుకున్న అమ్మాయిది సరిగ్గా నా వయస్సే'' అన్నది లిజీ.

నేను నవ్వాపుకోలేకపోయాను.

''ఇంతకూ నువ్వు మ్యారీడా? అన్‌మ్యారీడా?'' కుతూహలంగా అడిగాను.

''రెంటికీ పెద్ద తేడా లేదంకుల్. ఓ బోయ్ ఫ్రెండు వుండేవాడు. ఉత్త లోఫర్‌గాడు. నేనంటే పడి చచ్చేవాడు. నదురుగా వున్నాడని ఎవతో ఎగరేసుకుపోయింది. ఇక్కడిది కామన్. వర్జిన్‌గా మిగలడం చాలా కష్టం..'' నెయిల్ పాలిష్ గిల్లుకుంటూ, ముఖంలోని భావాలు నేను చదవకుండా జాగ్రత్తపడుతూ అన్నది లిజీ.

కొంచెంసేపు యిద్దరం మౌనంగానే వున్నాం.

''కాఫీ తాగుదామా అంకుల్'' అన్నది లిజీ.

లోనికెళ్ళి రెండు కాఫీ లోటాలు తీసుకొచ్చి ఒకటి లిజీకందించాను.

స్ట్రాలోంచి కాఫీ సిప్‌చేస్తూ సిగరెట్ వెలిగించింది. రెండు దమ్ములు లాగేసరికి దగ్గొచ్చి లిజీ కంట్లో నీళ్ళు తిరిగాయి.

''స్మోకింగ్ మానేయకూడదూ...? స్మోకింగ్ వల్ల...'' నా మాటలు పూర్తికానే లేదు. లిజీ అందుకుంది.

''స్టాప్... స్టాప్... స్మోకింగ్ వల్ల త్రోట్ క్యాన్సర్ వస్తుంది. బ్రెస్ట్ క్యాన్సర్ వస్తుంది. లంగ్స్ క్యాన్సర్ వస్తుంది. నోటి క్యాన్సర్ వస్తుంది. కిడ్నీలు, బ్లాడర్ చెడిపోతాయి. ఎముకలు పాడవుతాయి. శరీరం ముడుతలు పడుతుంది. విషాన్ని నికోటిన్ రూపంలో తీసుకోవద్దు అంటూ ఇప్పుడో క్లాసు పీకబోతున్నారు.... ఇన్‌ఫెర్టిలిటీతో సహ మీకు తెలియని – ఆడవాళ్ళకు సంబంధించిన చాలా డిసీజ్‌లు వస్తాయని నాకు తెలుసు. నాకేంటి. చాలామంది స్మోక్ చేసేవాళ్ళకు తెలుసు...'' అన్నది.

''మరి తెలిసీ ఎందుకు మానరు?'' అని అడిగాను సూటిగా.

''పెళ్ళి విషయం తీసుకోండి అంకుల్. పెళ్ళంటే ఓ పెద్ద లైఫ్ రిస్క్ అని అందరికీ తెలుసు. కానీ పెళ్ళి చేసుకోకుండా ఎవరుంటున్నారు?'' అని జోక్ చేసింది లిజీ.

''నీకంతా వేళాకోళమే. మొండిఘటం...'' అన్నాను కోపంగా.

''ఆకలి దంచేస్తున్నది. వంట చేసుకునే ఓపిక లేదు. ఇవ్వాళ డిన్నర్ హోటల్లోనే. ఓ పది డాలర్లుంటే యివ్వండి అంకుల్. జీతం రాగానే యిచ్చేస్తా'' ఏమాత్రం సంకోచం లేకుండా అడిగింది లిజీ.

లేదనలేకపోయాను. జేబులోంచి పది డాలర్లు తీసి యిచ్చాను.



**నరకం**

ఒక రచయిత చనిపోయాడు. యమభటులొచ్చి ''స్వర్గానికెళతావా... నరకానికెళతావా....?'' అని ఛాయిస్ అడిగారు. మనవాడు ఎగిరి గంతేసి ''స్వర్గానికి'' అన్నాడు.

స్వర్గంలో పెద్దగా సంచారం లేదు. రచనలు ఎవరికైనా వినిపిద్దామంటే వీల్లేదు. ఎవరిపని వాళ్లది. ఆకలిదప్పులు లేవు. అప్పుడప్పుడు రంభా ఊర్వశులు వచ్చి 'తయ్యకతకధిం' అని వెళ్లిపోతున్నారు. రచయితకు విసుగెత్తి ''నరకమెలావుంటుందో చూపించు'' అన్నాడు, భటుడితో

భటుడు నరకలోకపు ప్రధానద్వారం దగ్గర వదిలాడు. లోపలికి తొంగిచూస్తే ఎక్కడ చూసినా రచయితలు, కవులే. ఎదుటివాడితో నిమిత్తం లేకుండా కవితలు, కథలు చదివిపడేస్తున్నారు. రచయిత అనుమానంగా భటుని వంక చూసాడు.

''దీన్నే మేం నరకమంటాం'' అని లోపలికి తోసాడు భటుడు.

''బై అంకుల్. సీయూ'' అంటూ వేగంగా వెళ్ళిపోయింది లిజీ.

ఏమాత్రం అర్థంకాని ఆ పిల్ల గురించి ఆలోచిస్తూ కూచున్నాను.

* * *

ఎంత చెప్పినా వినకుండా డిన్నర్ యిస్తానని పట్టుబట్టింది లిజీ. బలవంతంగా నన్ను రెస్టారెంట్‌కు తీసుకొచ్చింది.

రెస్టారెంటు మసక చీకటిలో ఓ గుహలా వుంది. ప్రతీ టేబుల్‌పైన సన్నని కాంతితో గుడ్డిగా వెగుతున్నాయి క్యాండిల్స్. హమ్మింగ్ చేస్తున్నట్టు మంద్రస్వరంతో ఏదో పాట వినిపిస్తున్నది.

జనం అంతగా లేరు. మేం ఓ మూలకు పోయి కూచున్నాం. బేరర్ ప్లేటూ, గ్లాసులూ, ఫోర్కులూ, నైఫ్‌లూ టేబుల్‌మీద సరిపెట్టి మెనూ అందించాడు.

''చెప్పండి అంకుల్. ఏం తీసుకుంటారు?'' అడిగింది లిజీ.

''ఏదైనా సాఫ్ట్ డ్రింక్ చాలు'' అన్నాను.

''ఫుడ్ చెప్పండి'' అంది.

''నీ యిష్టం'' అన్నాను.

చికెన్ లెగ్స్, లాబ్‌స్టర్, ఫిష్ చిప్స్, ఫ్రైడ్ ఆర్డరిచ్చింది.

''మీ కభ్యంతరం లేకుంటే నేను కొంచెం విస్కీ తీసుకుంటా అంకుల్'' అన్నది చిన్నగా.

''నాటెటాల్... తీస్కో...'' అన్నాను చిన్నగా నవ్వి.

లిజీ లార్జ్‌పెగ్ ఆర్డరిచ్చింది.

బేరర్ అన్నీ తెచ్చి టేబుల్ మీద అమర్చాడు. నేను ఏం తినాలో అర్థంకాక కెలుకుతున్నాను.

లిజీ మెల్లగా విస్కీ సిప్ చేస్తున్నది. మధ్య మధ్య దగ్గు తెరలు తెరలుగా వస్తున్నది. క్రమంగా ఆమె కళ్ళు ఎర్రబడ్డాయి. ముఖంమీదికి మత్తుతెర కమ్ముకుంటున్నది.

కుర్చీ వెనక్కి రిలాక్స్‌డ్‌గా వాలి ''ఇవాళ ఇక్కడ ఇలా మీ పక్కన కూచుంటే ఏవేవో గుర్తొస్తున్నాయి అంకుల్'' అంది లిజీ.

''ఏం గుర్తొస్తున్నాయి?'' అన్నాను కుతూహలంగా.

''చిన్నప్పుడు చదువుకున్న పాబ్లో నెరూడా లవ్ సానెట్ గుర్తొస్తున్నది.... వెన్ ఐ డై ఐ వాంట్ యువర్ హ్యాండ్స్ ఆన్ మై ఐస్... ఎంత గొప్పగా చెప్పాడు! ఎంత పాషనేట్ ఎక్స్‌ప్రెషన్ అది! పోయెమ్ అంతగా పరుచుకున్న పేథాస్ గుండెల్ని పిండుతుంది.... చివరి ఘడియల్లో తనను ప్రేమించే చేతులు కళ్ళను మృదువుగా స్పృశించి లాలించడంకన్నా ఏ స్త్రీ అయినా కోరుకునే అదృష్టం ఇంకేముంటుంది...?'' అలా పైకి, శూన్యంలోకి చూస్తూనే చెబుతున్నది లిజీ.

''నిజమే. నేనూ చదివాను. మంచి కవిత'' అన్నాను పొడిపొడిగా.

''కానీ అంకుల్... నా దురదృష్టం... నన్నలా ప్రేమించేవాళ్ళు ఒక్కరూ లేరు... మా నాన్న పెళ్ళాం నా ముందరే మా నాన్నతో ఇరోటిక్‌గా.. అసహ్యంగా ప్రవర్తిస్తుంది. మా అమ్మ మొగుడయితే నన్ను నమిలి మింగేసేట్టు గుంటనక్కలా గుటకలు వేస్తూ చూస్తుంటాడు. ఇక బోయ్ ఫ్రెండు... వాడొక చీట్... అంతా... అంతా వాళ్ళ ప్రవర్తనతో నన్ను తరిమి తరిమి కొడుతున్నారు. నేనింకా ఎవరికోసం బతకాలి అంకుల్.... నాకు చచ్చిపోవాలని వుంది...'' బర్స్ట్ అయింది లిజీ. రెండు చేతుల్లో ముఖాన్ని పెట్టుకుని వెక్కివెక్కి ఏడుస్తున్నది.

''నోనో. కంట్రోల్ యువర్ సెల్ఫ్... నేనున్నాను... ఐ లవ్ యూ లిజీ'' అన్నాను ఇమోషనల్‌గా.

టక్కున ఏడుపు ఆపింది. నమ్మలేనట్టు నావైపు చూసింది. కొంచెంసేపు నేలకు చూపులు దించుకొని మౌనంగా గడిపింది. వెంటనే – అంత సీరియస్ మూడ్‌ను పటాపంచలు చేస్తూ ఒక్కసారిగా పకపకా నవ్వడం మొదలెట్టింది.

''సిగరెట్ కాల్చే ధైర్యమే లేదు మీకు. నన్ను

లవ్ చేసి మీ జీవితాన్ని కాల్చుకోగలరా అంకుల్... వాటే ఫన్నీ... అయినా పోయేవాళ్ళను లవ్ చేయడం కూడా థ్రిల్లింగ్‌గానే వుంటుందిలెండి...'' చివరి మాటల్ని సాధ్యమైనంత మెల్లగా అంది లిజీ.

నేను ఒక్కసారే నిటారుగా అయ్యాను. లిజీ ఏమంటున్నదో నాకర్థం కాలేదు.

''వ్హాట్?'' అన్నాను గట్టిగా.

''అదే... మీరు ఇండియాకు పోతారు కదా? ఎప్పుడూ వెళ్లడం?'' అని మాట మార్చింది.

''ఓ ... అదా ... ఈనెల ఇరవై రెండు.. మధ్యాహ్నం ఒంటిగంట ఫ్లైటుకు'' అన్నాను.

''ఫేర్‌వెల్ చెప్పడానికి, ఎయిర్‌పోర్టుకు తప్పకుండా వస్తా అంకుల్'' అంది లిజీ.

''నువ్వు రాకుండా నేనెలా వెళతాను?'' అన్నాను.

''ఇంత హ్యాపీగా నా జీవితంలో నేనెన్నడూ లేను అంకుల్. రియల్లీ ఐయామ్ వెరీ హ్యాపీ... ఇంకో పెగ్గు లాగించాలనిపిస్తున్నది...'' నావైపు ఓరగా చూస్తూ అన్నది.

మళ్ళీ ఖణేల్ ఖణేల్‌మంటూ దగ్గింది. ఆయాసపడుతున్నట్టు అనిపించింది.

''నోనో... యిక చాలు.. కమాన్ లెట్స్‌గో...'' అంటూ లేచాను.

లిజీ బిల్లు చెల్లించింది. ఇద్దరం బయటికొచ్చాం.

''ఎప్పుడైనా నేను గుర్తొస్తే ఫోన్ చెయ్యండి అంకుల్'' అన్నది లిజీ.

జేబులో వున్న చిన్న నోట్‌బుక్‌లో నెంబర్ నోట్ చేసుకున్నాను.

లిజీ వెళ్ళేదాకా వుండి గుడ్‌నైట్ చెప్పి నేనూ బయలుదేరాను.

* * *

ఇండియాకు కావలసిన వస్తువులు షాపింగ్ చెయ్యడంలోనూ, ఇంకా చూడదగ్గ ప్లేసులు ఏమున్నా వుంటే అది చూడటంలోనూ పదిహేను రోజులు ఇట్టే గడిచిపోయాయి. ఈ పదిహేను రోజుల్లో రెండు మూడుసార్లే బోర్డర్స్‌కు వెళ్ళగలిగాను. ఆ రెండు మూడుసార్లు కూడా లిజీ కలవనే లేదు.

నేను ప్రయాణం కావల్సిన రోజు రానే వచ్చింది. ఇంట్లో మా అమ్మాయి, అల్లుడూ హడావుడి పడిపోతున్నారు. ఇంకా ఇవి సర్దుకోలేదు అవి సర్దుకోలేదు అంటూ నసుగుతూనే వున్నారు.

నా మనసంతా చికాకుగా వుంది. మాటిమాటికీ గడియారం చూసుకుంటున్నాను. అకారణంగా విసుక్కుంటున్నాను.

టైం పదకొండు గంటలయింది. ఇక్కణ్ణుంచి శాన్‌ఫ్రాన్సిస్కో ఎయిర్‌పోర్టుకు వెళ్ళాలంటే అధమపక్షం గంట పడుతుంది. కనీసం పన్నెండింటికైనా బయల్దేరితేగాని ఒంటిగంటకల్లా చేరుకోము. ఫేర్‌వెల్ చెప్పడానికి వస్తానన్న లిజీ యింకా రాలేదు. నాకు క్షణక్షణానికీ టెన్షన్ పెరిగిపోతున్నది.

లిజీ యింటికి ఫోన్ చేశాను. తండ్రి కాబోలు మాట్లాడాడు. నా నవనాడులూ పట్టుతున్నట్టనిపించింది. గుండె వేగంగా కొట్టుకుంటున్నది.

ఇంట్లోవాళ్ళు ఎక్కడికని అడుగుతున్నా సమాధానం చెప్పకుండా హడావుడిగా లిజీ యింటికి బయలుదేరాను.

నన్ను చూసి లిజీ తండ్రి 'రండి రండి' అంటూ ఆహ్వానించాడు. ''అమ్మాయి ఆరోగ్యం బొత్తిగా చెడిపోయింది. చాలారోజుల నుండి లంగ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నది. వారం రోజుల్నుండి మరీ విషమించింది. మాటిమాటికీ స్పృహ కోల్పోతున్నది. మీరొస్తారని చెప్పింది. మీ కోసమే కళ్లలో ప్రాణం పెట్టుకుని ఎదురు చూస్తున్నది... సిగరెట్లు మానమని ఎంత మొత్తుకున్నా వినలేదు. నేను ఇన్సూరెన్స్ కూడా చేయలేదు. చేస్తే వైద్యం ఖర్చులు కంపెనీలే భరించేవి. ప్రైవేటు వైద్యం చేయించే స్తోమత మాకు లేదు... దాని ఫేట్ అలా వుంది...'' సంజాయిషీ యిస్తున్నట్టు అన్నాడు తండ్రి.

లిజీ నిస్త్రాణంగా బెడ్ మీద పడి వుంది. ముఖంలో ఏమాత్రం జీవకళ లేదు.

''లిజీ... లిజీ.. ఎవరొచ్చారో చూడు...'' అంటూ లిజీ తండ్రి బిగ్గరగా పిలిచాడు.

లిజీ మెల్లగా కదిలింది. బలవంతంగా కళ్ళు తెరిచి, చిట్లించి చూసింది. కొంచెం సేపటికి నన్ను పోల్చుకుంది. వాడిపోయిన నవ్వొకటి పెదాల మీద ఓ క్షణం మెరిసి మాయమయింది.

బలమంతా కూడగట్టుకొని చేయి పైకి తీసుకుంది. సిగరెట్టు తాగుతున్నట్టుగా రెండు వేళ్ళు పెదాల మీద ఆనించి, మెల్లగా ఒక కన్ను మూసి నావేపు ఓరగా చూసింది. అదే కొంటెతనం. ఈ ఆర్నెల్లూ నన్ను వెంటాడిన... వేటాడిన... కొంటెతనం... నెమ్మదిగా లిజీ కళ్ళు మూసుకుపోయాయి.

ఉద్విగ్న మనసును కంట్రోల్ చేసుకోవడం కష్టమవుతున్నది.


'నాకు సిగరెట్టు కాల్చే ధైర్యం వుండనీ వుండక పోనీ.... ఐ లవ్ యూ... బేబీ!' అని నాలో నేను అనుకుంటూ లిజీ దగ్గరకు వెళ్ళి నుదుట మృదువుగా ముద్దుపెట్టుకున్నాను.

ఐసు ముక్కను ముద్దుపెట్టుకున్నట్టు చల్లగా తాకింది నుదురు. అనుమానంగా ముక్కు దగ్గర వేలు పెట్టి చూశాను. శ్వాస ఆడడం లేదు.

వణుకుతున్న చేత్తో మెల్లగా కళ్ళు నిమిరాను.

'ఫేర్‌వెల్ చెప్పడానికి వస్తానని మాటిచ్చావ్. కానీ నేను నీకు యిలా ఫేర్‌వెల్ చెప్పవలసి వస్తుందని కలలో కూడా అనుకోలేదు లిజీ' అని నా మనసు మూలిగింది.

టైం చూసుకున్నాను. ఒంటిగంట దాటింది. ఫ్లైట్ మిస్ అయినట్టే. సిగరెట్ల వల్ల ఇక్కడ ఒక అమ్మాయి జీవితమే మిస్సయింది.



## నాకంటే గొప్ప నటులున్నారు

**త**న అభిప్రాయాలను దాచుకునే అలవాటు షారూక్‌కి లేదు. నిర్మోహమాటం ఆయన సొంతం. ''చాలామందిలా నాకీ ప్రపంచాన్ని జయించాలన్న కోరిక లేదు. ఎందుకంటే నా ఇల్లే నా ప్రపంచం. నేనో అద్భుత నటుడిననే అభిప్రాయం నాకు లేదు. ఫీల్డ్‌లో నాకంటే గొప్ప నటులు, నాకంటే ఎక్కువ కష్టపడేవాళ్లు ఎందరో వున్నారు. నాక్కొంచెం అదృష్టం కలిసొచ్చింది. సరైన సమయంలో, సరైన సినిమాలో, సరైన పాత్రలో నటించడం నాకు కలిసొచ్చింది. మాధురి దీక్షిత్, జూహీచావ్లా కంటే నేను గొప్ప నటుడ్నేమీ కాదు. గత 13 ఏళ్లుగా నేను చాలా మంచి నటుణ్ణని పత్రికలు రాస్తున్నాయి. కాని నేను నటుడు కావడం వెనుక ఎన్నో అపజయాలున్నాయి. నేను శిఖరాలను ఎక్కుతున్నానని అంటున్నారు. కాని నా గాయాల సంగతో...'' రియల్లీ షారూక్ ఈజ్ గ్రేట్.